క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 33/11కేవీ రంగదాంపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, ఎల్లుపల్లి, బొగ్గులోని బండ, మైత్రివనం, కాకతీయనగర్, రాజేంద్రనగర్, బీజేఆర్ చౌరస్తా, మహాశక్తినగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఘనంగా చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే



బొమ్మల తయారీపై తల్లులకు శిక్షణ

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డే వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు ఉపేంద్ర, అండాలు మాట్లాడుతూ 4వ శనివారం సందర్భంగా పిల్లల తల్లులకు సృజనాత్మకతపై అవగాహన కల్పించామన్నారు. అనంతరం చిన్నపిల్లలు ఆడుకునే వివిధ రకాల బొమ్మలు తయారుచేసే విధానంపై తల్లులకు శిక్షణ ఇచ్చారు. పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు గాను పలు రకాల ఆకులు, పువ్వులు, పెన్సిల్ పొట్టు, స్కెచ్‌లు, మట్టితో తయారు చేసిన బొమ్మలను ప్రదర్శించారు. కార్యక్రమంలో తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



శంకర్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బైరి శంకర్‌ను శనివారం ఆ పార్టీ మండల నాయకులు అభినందించారు. మాజీ మండలాధ్యక్షుడు బెదురు కుమారస్వామి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమాచారి, శ్రీనివాస్, సత్యం, స్వామి, కిష్టయ్యగౌడ్, ప్రసాద్, రమేశ్, అనిల్ పాల్గొన్నారు.

నేడు 'నీరాజనం' పుస్తకావిష్కరణ



మాట్లాడుతున్న రాజేశం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రముఖ పద్యకవి షరీఫ్ రచించిన నీరాజనం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం తెలిపారు. సిద్దిపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్బన్ మండల పరిధిలోని తడకపల్లి ఆవాస విద్యాలయంలో మధ్యాహ్నం జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో పద్య సాహిత్య శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన కవులు, రచయితలు, సాహితీ అభిమానులు అధిక సంఖ్యలో హాజరయ్యి విజయవంతం చేయాలని కోరారు. జాతీయ సాహిత్య పరిషత్ సభ్యుడు అశోక్, ఎల్లమ్మ పాల్గొన్నారు.

ఇసుక డంపుల స్వాధీనం



ఇసుక డంపును స్వాధీనం చేసుకున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని జాలపల్లిలో అక్రమంగా డంపు చేసిన ఇసుకను శనివారం టాస్క్‌ఫోర్స్, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ షేక్ మహబూబ్ మాట్లాడుతూ గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద తుపాకుల శ్రీనివాస్, పోతన యాదగిరి ఎలాంటి అనుమతి లేకుండా 20 టన్నుల ఇసుకను డంపు చేశారన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఆ డంపును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శిఖం.. ఖతం

- యథేచ్ఛగా చెరువు భూములు కబ్జా
- వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు
- అధికారుల పర్యవేక్షణ కరువు

ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన బాధ్యతను అధికారులు తుంగలో తొక్కేస్తున్నారు. దీంతో అక్రమార్కులు దర్జాగా కబ్జాలకు పాల్పడుతున్నారు.



బోరగుండు చెరువులో భూమిలో చేసిన సాగు

కొండపాక(గజ్వేల్): మండలంలోని చెరువు శిఖం భూములు కబ్జాకు గురవుతున్నాయి. కుకునూరుపల్లి మండలంలోని మేదినిపూర్ గ్రామ శివారులో ఎన్నో యేళ్ళ నాటి బోరగుండు కుంట సర్వే నంబరు 133లోని 1.27 ఎకరాల శిఖం భూమి కబ్జాకు గురవ్వడంతో చెరువు ఆనవాళ్లు లేకుండా పోయాయి. మిగతా చెరువులది కూడా ఇదే దుస్థితి.

ఇదీ చెరువుల పరిస్థితి..

పోసానికుంట, చింతల చెరువు భూములను కొంత వరకు కబ్జాచేసి వ్యవసాయ పనులకు ఉపయోగించుకుంటున్నారు. లకుడారం గ్రామంలోని ఇసుక చెరువు, బొబ్బాయిపల్లిలో ధర్మ చెరువు, కుకునూరుపల్లి శివారులోని కలకలమ్మ చెరువు భూములదీ అదే దుస్థితి. కలకలమ్మ శిఖం భూమి విస్తీర్ణం 143.9 ఎకరాలు. ఈ భూమి బొబ్బాయిపల్లికి ఆనుకొని ఉండటంతో చాలా మంది చాలా యేళ్లుగా ఇళ్లు నిర్మించుకొన్నారు.



కలకలమ్మ చెరువు శిఖం భూమిలో నిర్మాణంలో ఉన్న భవనం

అధికారుల నిర్లక్ష్యంతోనే..

కొత్తపల్లి మనోహరాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్లేందుకు రైలు మార్గాన్ని కలకలమ్మ చెరువు భూమిలో నుంచే వేశారు. ఇది వరకు కబ్జాచేసి ఇళ్ల నిర్మాణాలు చేయగా మిగిలిన చెరువు శిఖం భూమిని కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఇదంతా రెవెన్యూ అధికారుల మామూళ్ల మత్తులో జరుగుతున్నాయన్న ప్రచారం సాగుతోంది. చెరువు శిఖం భూమిలో చేపడుతున్న నిర్మాణాలను రెండు నెలల కిందట రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు సజావుగా సాగాలంటే అధికారులకు ముడుపులు చెల్లించాలని కొందరు నాయకులు డబ్బులు వసూళ్లకు పాల్పడినట్టు ప్రచారం సాగింది. దీంతో మళ్లీ ఇళ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయన్న విమర్శలు ఉన్నాయి.

నిర్లక్ష్యం వహిస్తే కూల్చివేస్తాం

ఈ విషయమై తహసీల్దార్ సుజాతను వివరణ కోరగా అక్కడక్కడా చెరువు శిఖం భూములు కబ్జాకు గురయ్యాయన్న మాట వాస్తవమేనన్నారు. అక్రమ నిర్మాణాలు జరుగకుండా చూస్తామని, జరిగిన చోట ఎంక్వయిరీ రిపోర్టు ఇవ్వాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించామన్నారు. ఖాతరు చేయకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని హెచ్చరించారు.

అగ్గితెగులు నివారణకు చర్యలు

ఎఈఓ నాగార్జున



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈఓ నాగార్జున

తొగుట(దుబ్బాక): వరికి సోకే అగ్గితెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఎఈఓ నాగార్జున రైతులకు సూచించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లిలో శనివారం వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంట చిరుపొట్ట దశ నుంచి కంకి పాలుపోసుకునే దశలో ఉందన్నారు. అక్కడక్కడా వరికి అగ్గితెగులు సోకినట్టు గమనించామని తెలిపారు. ఈ తెగులు వల్ల ఆకులపై ముదురు రంగు అంచుతో మధ్యలో బూడిదరంగుగల నూలుకండె ఆకారం మచ్చలు ఏర్పడతాయని చెప్పారు. ఉధృతి పెరిగినప్పుడు మచ్చలు కలసిపోయి ఆకులు ఎండిపోయి పొలం తగలబడినట్టు కనిపిస్తుందని తెలిపారు. ఆకుమచ్చ దశలోనే నివారించకపోతే అధికంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ తెగులు నివారణ కోసం ఎకరాకు ఐసోప్రోథయోలెన్ 300 మిల్లీ లీటర్లు, లేదా ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ 500 గ్రాములు లేదా కాసుగామైసిన్ 500 మిల్లీ లీటర్లు స్ప్రే చేయాలని రైతులకు సూచించారు. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత స్ప్రే చేసుకుంటే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు.

నివారణ చర్యలతో తగ్గుముఖం

సిద్దిపేటఅర్బన్: నివారణ చర్యలతో వరిలోకి సోకుతున్న ఎండు తెగులును తగ్గించుకోవచ్చని అర్బన్ మండల ఏఓ బి.శ్రీనాథ్ చెప్పారు. శనివారం రంగధాంపల్లిలో రైతు వంగ నాగిరెడ్డికి చెందిన వరి పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉష్ణోగ్రతల్లో ఉండే అధిక వ్యత్యాసం వల్ల కానీ నత్రజనిని అధికంగా వాడటం వల్ల కానీ ఈ తెగులు సోకుతుందన్నారు. దీని నివారణకు కోసైడ్ (కాపర్ హైడ్రాక్సైడ్) మందును ఎకరాకు 400 గ్రాములు వాడాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ పవన్ ఉన్నారు.

ఫర్నీచర్ అందజేసిన పూర్వవిద్యార్థిని



ఫర్నీచర్ అందజేస్తున్న లాస్య

గజ్వేల్‌రూరల్: తాను చదువుకున్న పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్‌ను అందించిన పూర్వ విద్యార్థిని అందరి మన్ననలు పొందింది. ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(పల్లెపహాడ్)కు చెందిన అనంతోజు లాస్య (భార్గవి) 6వ తరగతి వరకు గ్రామంలోని ఎంపీపీ ఎస్‌లో చదువుకుంది. ప్రస్తుతం ఆమె సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. తాను చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలని నిర్ణయించుకొని, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలకు ఒక బీరువా, 7 కుర్చీలు, 7 టేబుళ్లు శనివారం అందజేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భార్గవి దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు మంజుల, రేణుక, ప్రభావతి, గీతామాధురి, శ్వేత, శ్రీకరి, సీఆర్పీ చంద్రశేఖర్, అశోక్ తదితరులున్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

సీఐ షేక్ లతీఫ్



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ లతీఫ్

దుబ్బాకటౌన్: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. రాయపోల్ మండలం రామారంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ఎస్ఐ రఘుపతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాలలో దొంగతనాలు జరుగుతున్నాయని, సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను పట్టుకోవడం కష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో రామారం గౌడ సంఘం అధ్యక్షుడు శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ మహేశ్ గౌడ్, గౌడ సంఘ సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



రాజమల్లయ్యను సన్మానిస్తున్న లింగమూర్తి

హుస్నాబాద్: నిత్యం వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. పట్టణానికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య తన 55వ జన్మదినం సందర్భంగా శనివారం 10 కిమీ. పరుగు పందెం పూర్తి చేశాడు. అనంతరం గాంధీ చౌరస్తాలో ఆయనను శాలువాతో అభినందించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ వయస్సుతో నిమిత్తం లేకుండా మంచి ఆరోగ్యపు అలవాట్లతో నిత్యం శారీరక దారుఢ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ హుస్సేన్, మిత్రమండలి–87 స్వచ్ఛంధ సంస్థ నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, మోహన్, వర ప్రసాద్, రవీందర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు సమావేశాలు



మద్దూరు(హుస్నాబాద్): నృత్యం చేస్తున్న విద్యార్థులు

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి ఆకాంక్షించారు. కళాశాలలో శనివారం ఉత్సాహంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ గ్రామాల్లో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాలలో చేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కంఠరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనువాస్, బాలసిద్దులు తదితరులు పాల్గొన్నారు.

చక్కగా చదువుకోవాలి

నంగునూరు(సిద్దిపేట): పరీక్షలకు భయపడకుండా విద్యార్థులు చక్కగా చదివి మంచి మార్కులు సాధించాలని అక్కేనపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జానయ్య కోరారు. పదోతరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రామస్వామి, శ్రీనివాస్, రజిత, పవన్‌కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణతో ఉజ్వల భవిష్యత్

- ఎన్‌ఆర్‌ఐ ప్రతాప్‌రెడ్డి
- రూ.4.62లక్షలతో ల్యాబ్ ఏర్పాటు



కంప్యూటర్లను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కంప్యూటర్ శిక్షణ ఎంతో దోహదపడుతుందని మండల పరిధిలోని ముస్త్యాలకు చెందిన ఎన్‌ఆర్‌ఐ, రిటైర్డ్ కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ పెడతల ప్రతాప్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సొంత నిధులు రూ.4లక్షల 62వేలతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన ఈ ప్రాంత విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్ ఉండాలన్న ఉద్దేశ్యంతోనే కళాశాలలో 10 కొత్త మోడల్ కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రిన్సిపాల్ ప్రణీత మాట్లాడుతూ విద్యార్థులు అధునాతన కోర్సులు నేర్చుకోవడానికి ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కంప్యూటర్ విభాగాధిపతి నరేశ్‌కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కళాశాల విద్యార్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన ఇంటర్ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. అలాగే కళాశాలలో గ్రంథాలయ ఏర్పాటుకు రూ.లక్ష విరాళం అందించేందుకు ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డికి అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్‌పై అపోహలు వద్దు

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



మేళాలో చికెన్ తింటున్న నర్సారెడ్డి

గజ్వేల్: తెలంగాణలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకలేదని, నిరభ్యరంతరంగా చికెన్, కోడిగుడ్లను వినియోగించవచ్చని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గజ్వేల్‌లో వెన్‌కాబ్ ఆధ్వర్యంలో శనివారం చికెన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్, ఉడికిన కోడిగుడ్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సారెడ్డి మాట్లాడుతూ 70 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద చికెన్ ఉడికితే ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. చక్కని పోషక విలువలు కలిగిన చికెన్‌కు ప్రజలు దూరంగా ఉండొద్దని, అపోహలను పట్టించుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి ఆహ్వానం

గజ్వేల్‌రూరల్: ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి రావాలంటూ మెదక్ ఎంపీ రఘునందన్‌రావును ప్రజ్ఞాపూర్ గ్రామస్తులు కోరారు. బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌తో కలిసి శనివారం హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు చెప్పారు. వెంకట్‌రెడ్డి, శ్రీను, రాజు, దేవేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య

మద్దూరు(హుస్నాబాద్): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. శనివారం దూల్మిట్ట మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సీఆర్పీ నారదాసు ఉమాదేవి అధ్యక్షతన నిర్వహించిన ఈసీసీఈ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సద్దేశ్వర్, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సిద్దిపేటఅర్బన్: మానసిక పరిస్థితి సరిగాలేని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలోని పొన్నాల గ్రామంలో చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మర్కంటి పోచయ్య (61)కు యేడాది నుంచి మానసిక పరిస్థితి సరిగాలేదు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంటి స్లాబ్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

సిద్దిపేటఅర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొండపాక మండలం మర్పడగ గ్రామానికి చెందిన ఉడెం మల్లారెడ్డి(55) శుక్రవారం రాత్రి సిద్దిపేటకు వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తుండగా పొన్నాల శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి గాయపడ్డాడు. అటుగా వెళ్తున్న వాహనదారుడు గమనించి 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి కొడుకు రవీందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా స్వపరిపాలన దినోత్సవం

పలు ప్రాథమిక పాఠశాలల్లో స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటివారికి పాఠాలు బోధించారు. ప్రతిభ చూపిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు.



కొండపాక(గజ్వేల్): దుద్దెడ ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



దుబ్బాక: ధర్మాజీపేట పాఠశాలలో..



తొగుట(దుబ్బాక): వెంకట్రావుపేట పాఠశాలలో..

సంక్షిప్త వార్తలు

◆ చెడు అలవాట్లకు బానిసలు కావొద్దు

తొగుట(దుబ్బాక): యువకులు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని ఎస్‌ఐ రవికాంత్‌రావు సూచించారు. మండల కేంద్రంతో పాటు వెంకట్రావుపేటలోని దుకాణాలు, హోటళ్లు, అనుమానాస్పద స్థలాల్లో నార్కోటిక్స్ డాగ్స్‌తో శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మినా.. సేవించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

◆ బీఎస్పీ బలపర్చిన అభ్యర్థులు

బెజ్జంకి(సిద్దిపేట): ఉపాధ్యాయ, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులుగా బీఎస్పీ బలపరిచిన యాటకారి సాయన్న, ప్రసన్న హరికృష్ణలను గెలిపించాలని ఆ పార్టీ సెంట్రల్ కోఆర్డినేటర్ నిశాని రామచంద్రం పిలుపునిచ్చారు. బెజ్జంకిలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జిలు బాలయ్య, రాజేందర్, నాయకులు మల్లయ్య, రాజమల్లు, తిరుపతి పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ నేతల ఇంటింటి ప్రచారం

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని గెలిపించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్ కోరారు. మండలంలోని గూడెం, వడ్లూరు గ్రామాలలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ పాఠశాలల పరిశీలన

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లి, మాత్‌పల్లి, హనుమాన్‌నగర్, వడ్డెర కాలనీల్లోని ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఈఓ బచ్చలి సత్తయ్య సందర్శించారు. రికార్డులను పరిశీలించి, బోధన తీరులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆకర్షితులయ్యేలా చూసుకోవాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు అనిల్, పద్మ, ఉషాలత తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా

సిద్దిపేటకమాన్: తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుహాసిని అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు.

◆ పట్టభద్రులు తరలిరండి

చిన్నకోడూరు(సిద్దిపేట): కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా ఆదివారం కరీంనగర్ సర్కస్ గ్రౌండ్‌లో నిర్వహించే మహాగర్జనకు పట్టభద్రులు అధిక సంఖ్యలో తరలిరావాలని జిల్లా కోర్‌కమిటీ సభ్యులు రంగు భరత్ కోరారు. శనివారం చిన్నకోడూరులో పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగల పక్షాన పోరాడే వ్యక్తిని గెలిపించుకుందామన్నారు. సమావేశంలో సభ్యులు శ్రావణ్, అజహరొద్దీన్, రాంనారాయణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ కరపత్రాల ఆవిష్కరణ

దుబ్బాక: గోదావరిఖనిలో ఆదివారం జరగనున్న అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సంఘం జిల్లా బాధ్యుడు కీసరి ఎల్లన్న, రైతు కూలీసంఘం నాయకుడు స్వామి, కార్మిక సంఘం నాయకులు నర్సింహులు, మల్లేశం పిలుపునిచ్చారు. శనివారం దుబ్బాకలో సదస్సు కు చెందిన కరపత్రాలను ఆవిష్కరించారు. నాయకులు మధు, షాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళా సాధికారతకు పెద్దపీట

హుస్నాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తున్నాయని సీఐ శ్రీనివాస్ అన్నారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలు, అపరిచితులతోను అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు, షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

◆ ఘనంగా వార్షికోత్సవం

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి గురుకులాలు ఎంతో దోహదం చేస్తాయని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర ఉన్నత పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రఘునందన్ రావు అన్నారు. శనివారం అల్వాల చెప్యాల క్రాస్ రోడ్డులో ఉన్న గురుకుల పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు .ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యతో పాటు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్ బాబు, టీచర్లు, లెక్చరర్లు రవీందర్, రత్నయ్య, కరుణాకర్, నర్సయ్య, నవీన్, మహేశ్, సుభాష్, లింగం, అంజయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.